ఈనాడు
THE LARGEST CIRCULATED TELUGU DAILY
విజయవాడ 13-7-2019 శనివారం సిటీ సంపుటి 45 . సంచిక 334 రూ. 6-50 పేజీలు 18+20 www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



ఎన్నికల హామీల్లో సుమారు 80% తొలి బడ్జెట్‌లోనే అమలు చేయబోతున్నాం. పరిస్థితులు అనుకూలిస్తే మిగిలిన 20% హామీలను వచ్చే ఏడాది బడ్జెట్‌లో అమల్లోకి తెద్దాం. దీనివల్ల తొలి రెండేళ్లలోనే ఎన్నికల ప్రణాళికలోని హామీలను వంద శాతం నెరవేర్చినట్లవుతుంది.

*– మంత్రిమండలి సమావేశంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి*



దేశ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా అత్యంత దయనీయ ఆర్థిక స్థితిని మా ప్రభుత్వం వారసత్వంగా పొందింది. రాష్ట్రానికున్న పరిమిత ఆదాయాల్లోనే ఖర్చులు భరించాల్సి ఉంది. ఈ ప్రభుత్వానికి ప్రాప్తించిన ద్రవ్య స్థితి వల్ల కఠిన ప్రత్యామ్నాయాలను చూసుకోవాల్సి వచ్చింది. 2022నాటికి రాష్ట్రంలో లేమితనం లేకుండా చూడాలని భావిస్తున్నాం.

*– ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్*

## కీలక పథకాలకు కేటాయింపులు
(రూ.కోట్లలో)


15,746
పింఛన్లు


6,455.80
జగనన్న అమ్మఒడి


8,750
వైఎస్సార్ రైతు భరోసా


4,962.34
జగనన్న విద్యా దీవెన


16,720
గృహనిర్మాణ పథకాలు


1,788
'డ్వాక్రా' సున్నా వడ్డీ రుణాలు



13,139
జలయజ్ఞం


1,740
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ


1,880
గ్రామ, పట్టణ వాలంటీర్లు

# 9 నవ సంక్షేమం

- సర్వజన శ్రేయస్సుకు నవరత్నాలు
- మేనిఫెస్టో అమలుకే ప్రాధాన్యం
- సంక్షేమానికి రూ.75వేల కోట్ల పైమాటే
- శాసనసభకు తొలి బడ్జెట్ సమర్పించిన ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్



ఎన్నికల ముందు నుంచీ మనసా వాచా ఒకటే 'నవరత్న మంత్రం' జపిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి.. ఆంధ్ర జనం కట్టబెట్టిన అఖండ విజయం తర్వాత ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్లో.. ఆ నవ విధ సంక్షేమానికే పెద్ద పీట వేశారు. రైతులు, పేదలు, మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, వితంతువులు, వికలాంగులు... ఇలా అన్ని వర్గాల వారికీ బాసటగా నిలిచేందుకు, ప్రతి ఒక్కరికీ ఆర్థికంగా అండనిచ్చేందుకు ఉద్దేశించిన పథకాలకే భూరి కేటాయింపులు చేశారు. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ శుక్రవారం శాసనసభకు సమర్పించిన రూ.2.27 లక్షల కోట్ల బడ్జెట్లో రూ.75 వేల కోట్లకు పైగా సంక్షేమ రంగానికే అందించటం విశేషం. రైతన్నల పైన అయితే ఏకంగా రూ.28,866 కోట్ల వరాల వాన కురిపించారు. మొత్తానికి బడ్జెట్ ఆసాంతం నవరత్నాల ధగధగలే ప్రస్ఫుటంగా కనిపించే అంశం!!

### వరాల జల్లులు

- రూ.5 లక్షల కంటే తక్కువ వార్షికాదాయం ఉన్న మధ్య తరగతి కుటుంబాలకు ఆరోగ్యశ్రీ పథకం వర్తింపు.
- కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులను తీర్చిదిద్దేందుకు రూ.1500 కోట్లు
- ప్రతి చేనేత కుటుంబానికి ఏడాదికి రూ.24 వేల ఆర్థిక సాయం.
- సొంత వాహనం ఉన్న ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు ఏడాదికి రూ.10వేల ఆర్థిక సాయం
- కాపు కార్పొరేషన్‌కు రూ. 2వేల కోట్లు
- 2021 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి.

మరిన్ని బడ్జెట్ వార్తలు, కథనాలు లోపలి పేజీల్లో

**రాష్ట్ర బడ్జెట్ (2019–20)**
**రూ. 2,27,975 కోట్లు**

## అదిగో నవలోకం

- నవరత్నాలతో అన్ని వర్గాల సర్వతోముఖాభివృద్ధి
- వివక్ష లేకుండా అర్హులందరికీ పథకాలు
- సామాజిక, ఆర్థిక సర్వేలో ప్రభుత్వం వెల్లడి

10లో

## కోతల బడ్జెట్

- పేదల సంక్షేమ పథకాలకు కేటాయింపులు తగ్గించారు
- అభివృద్ధి పనులను పట్టించుకోలేదు
- తెదేపా అధినేత చంద్రబాబు విమర్శలు

8లో



## చక్కని సాగుకు నిధులు భళా

- వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ.28,866.23 కోట్లు
- ఉచిత విద్యుత్తుకు రూ.4,525 కోట్లు
- కొత్త పథకాలకు ప్రాధాన్యం
- వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన మంత్రి బొత్స సత్యనారాయణ

6లో

# సున్నా వడ్డీపై మళ్లీ రభస

**లక్షకు ఐదు వేలిస్తే రుణమంతా చెల్లించినట్లా?**

**23 స్థానాల నుంచి 13కి పడిపోతారు జాగ్రత్త**

**ఎలాంటి వాళ్లను తయారు చేశారయ్యా... ఇదేమైనా పశువుల సంతా?**

**బాబు, అచ్చెన్నాయుడులపై తీవ్రంగా మండిపడ్డ ముఖ్యమంత్రి జగన్**

**సీఎం తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు**

**రాజీనామా చేస్తారా, ప్రజలకు క్షమాపణ చెబుతారా?: చంద్రబాబు**

**శాసనసభా... చేపల బజారా?: తమ్మినేని**

ఈనాడు – అమరావతి

వ్యవసాయ రుణాలమీద సున్నా వడ్డీ అంశంపై తీవ్ర విమర్శలు, ఆరోపణలతో శుక్రవారం కూడా శాసనసభ దద్దరిల్లింది. ప్రతిపక్షనేత చంద్రబాబుపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. రూ. లక్ష అప్పులో రూ.ఐదు వేలు చెల్లించి రుణం మొత్తం (మిగతా 3లో)



నేను మాట్లాడుతుంటే రౌడీలూ, గూండాల్లా వ్యవహరిస్తూ సభలో దౌర్జన్యం చేసేందుకు తెదేపా సభ్యులు యత్నిస్తున్నారు. ప్రతిపక్ష నేత మాట్లాడినప్పుడు మావాళ్లెవరూ అడ్డుతగలలేదే? మాట్లాడే అవకాశం ఇచ్చినా సిగ్గులేకుండా మళ్లీ చేతులెత్తుతారా? బుద్ధి జ్ఞానం ఉండాలి. ఎమ్మెల్యేగా ఎలా ఎన్నికయ్యారయ్యా..! మర్యాద లేదు. గౌరవం లేదు. మీకసలు అసెంబ్లీ జరిపించడం తెలుసా? కళ్లెర్ర చేసిచూస్తే ఎవరూ భయపడరు? మీరు 23 మంది ఉన్నారు.. మావాళ్లు 150 మంది ఉన్నారు. ఒకసారి లేచారంటే ఎవరూ స్థానాల్లో తిరిగి కూర్చో లేరు. ఒకర్నికైనా బుద్ధి ఉందా? గౌరవం ఇచ్చి పుచ్చుకోవాలి. అందర్నీ కూర్చోమనండి.. అచ్చం (అచ్చెన్నాయుడు) కూర్చో...పర్సనాలిటీ పెరగడం కాదు.... బుర్ర పెరగాలి, బుద్ధి పెరగాలి.

– జగన్



వడ్డీలేని రుణాలు చెల్లించామా? లేదా? పథకాన్ని నిలిపివేశామా? కొనసాగించామా? అనే దానిపై పక్కా దస్త్రాలు మీ ముందు పెడుతున్నా. ఇదే విషయాన్ని గురువారం పక్కా ఆధారాలతో వివరిద్దామని బయటకు వెళ్లి వచ్చేలోగా మీరు (సభాపతిని ఉద్దేశించి) సభను వాయిదా వేశారు. వడ్డీలేని రుణాలు చెల్లించలేదని ఆరోపిస్తూ నన్ను రాజీనామా చేయాలని డిమాండు చేసిన ముఖ్యమంత్రిని అడుగుతున్నా....మీరు రాజీనామా చేస్తారా? ప్రజలకు క్షమాపణలు చెబుతారా?

– చంద్రబాబు

## చెన్నై గొంతు తడిపేందుకు..

- 200 కి.మీ. దూరం నుంచి ప్రత్యేక రైల్లో నీటి తరలింపు

**చెన్నై, న్యూస్‌టుడే:** తమిళనాడు రాజధాని చెన్నైలో నీటి ఎద్దడి విశ్వరూపం దాల్చింది. నగర ప్రజల దాహార్తిని తీర్చే 4 ప్రధాన జలాశయాలు పూర్తిగా అడుగంటడం, రుతుపవనాల ప్రభావం పెద్దగా లేకపోవడంతో పరిస్థితి మరింత దిగజారింది. జలమండలిలో ట్యాంకరు నీటిని బుక్ చేసుకుంటే మళ్లీ 30 రోజుల వరకు నీరు పొందలేని స్థితి ఏర్పడింది. చుట్టుపక్కల వ్యవసాయ బావులు, రాళ్ల క్వారీల నుంచి సేకరించిన నీటిని శుద్ధి చేసి నగర ప్రజలకు సరఫరా చేస్తున్నారు. అయినప్పటికీ పూర్తిస్థాయిలో అవసరాలు తీరడం లేదు. ఈ నేపథ్యంలో నగరానికి సుమారు 200 కిలోమీటర్ల దూరంలోని వేలూరు జిల్లా జోలారుపేట నుంచి కావేరి సహకార తాగునీటి పథకం నీటిని చెన్నైకు తరలించడానికి రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీని కోసం రూ.65 కోట్లు కేటాయించింది. శుక్రవారం జోలారుపేట నుంచి 2 ప్రత్యేక రైళ్ల ద్వారా నీటిని తరలించారు. 50 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన 100 వ్యాగన్లు ఉన్న రెండు ర్యాక్‌ల ద్వారా మొత్తం 50 లక్షల లీటర్ల నీటిని తీసుకొచ్చారు. వీటిని శుద్ధి చేసి ప్రజలకు సరఫరా చేయనున్నారు. ఇలా రోజుకు కోటి లీటర్ల నీటిని తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.



జోలార్‌పేట నుంచి విల్లివాక్కం రైల్వేస్టేషన్‌కు నీటి వ్యాగన్లతో చేరుకున్న ప్రత్యేక రైలు







**క్షీరార్థినాం కిం కరిణ్యా?**
పాలు కావల్సిన వాడికి పాలే ఇవ్వాలి. ఏనుగునిస్తే ఏం ఉపయోగం? నిరుద్యోగులకు కంటితుడుపు భృతుల కన్నా పని కల్పించడం అవసరం.

**ప్రియః ప్రజానాం దాతైవ, న పునః ద్రవిణేశ్వరః**
ఎన్ని నీళ్లున్నా ఏం లాభం? ఎవరూ సముద్రాన్ని ఇష్టపడరు. కాసిన్ని చినుకులు చిలకరించినా సరే, మేఘాన్నే కోరుకుంటారు.



## రెవెన్యూ: లోటు సవాలే

**ఈనాడు, అమరావతి:** రాష్ట్ర ఆర్థికవ్యవస్థను రెవెన్యూ లోటు కుంగదీస్తోంది. రాష్ట్రంలో సొంతపన్నుల ఆదాయం, పన్నేతర ఆదాయం, కేంద్రపన్నుల్లో వాటాలు, కేంద్రం నుంచి అందే గ్రాంట్ ఇన్ ఎయిడ్ అన్నింటినీ కలిపి రెవెన్యూ ఆదాయంగా లెక్కిస్తారు. రెవెన్యూ ఆదాయం కన్నా ఖర్చు ఎక్కువగా ఉంటే రెవెన్యూ లోటుగా పరిగణిస్తారు. ఈసారి రూ.1778.52 కోట్ల రెవెన్యూ లోటుతో బడ్జెట్ సమర్పించారు. 2014-15 నుంచి రెవెన్యూ లోటు రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి సవాలు విసురుతూనే ఉంది. 2018-19 ఆర్థిక సంవత్సరంలోనే రూ.5235.23 కోట్ల మిగులుతో బడ్జెట్ ప్రతిపాదించారు. ఆ తర్వాత బడ్జెట్ సంవత్సరం ముగిసేనాటికి మిగులు కనిపించలేదు. దాంతో అదికూడా లోటు సంవత్సరంగానే మారింది. మనకు ఆదాయం వచ్చే మార్గాల్లో ప్రధానంగా కేంద్రం నుంచి ఆశించినంత మేర సాయం అందకపోవడమే సమస్యగా ఉంది. పన్నుల ఆదాయం, పన్నేతర ఆదాయం కూడా అటూ ఇటుగా అంచనాలకు తగ్గట్టుగానే ఉంటోంది. కేంద్రం నుంచి వచ్చే పన్నుల వాటా కూడా పెద్దగా తేడాలేదు. కేంద్రం నుంచి గ్రాంట్ ఇన్ ఎయిడ్ మాత్రం ఆశించిన మేర రావడం లేదు.

**గత ఆరేళ్ల రెవెన్యూ లోటు (రూ.కోట్లలో)**

| ఆర్థిక సంవత్సరం | రెవెన్యూ లోటు |
|---|---|
| 2014-15 | 24,314.82 |
| 2015-16 | 7,301.87 |
| 2016-17 | 17,193.72 |
| 2017-18 | 16,151.68 |
| 2018-19 (సవరించిన అంచనాలు) | 11,654.90 |
| 2019-20 (అంచనాలు) | 1,778.52 |

## వ్యయం: 85 శాతమే

**ఈనాడు, అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.1,62,134 కోట్లు ఖర్చుచేసినట్లు తాజా గణాంకాలు చెబుతున్నాయి. వీటిని 2018-19 ప్రీ అకౌంట్స్‌గా చెబుతారు. అడ్వకేట్ జనరల్ పరిశీలన తర్వాత మరో నాలుగు నెలలకు వాస్తవ లెక్కలు తేలుస్తారు. బడ్జెట్ ప్రతిపాదనలతో పోలిస్తే 84.8% మేర ఖర్చుచేసినట్లు తెలుస్తోంది. రాష్ట్ర విభజన తర్వాత గడిచిన 5 ఏళ్లలో చివరి ఆర్థిక సంవత్సరంలోనే బడ్జెట్ అంచనాలతో పోలిస్తే ఖర్చు తక్కువ. ఇందుకు అనేక కారణాలున్నాయి. కేంద్రం నుంచి ఆశించిన నిధులు రాకపోవడమే కీలకం.

### కేంద్రం నుంచి ఆశించిన నిధులేవీ?

2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.1,55,598.27 కోట్లు రెవెన్యూ ఆదాయంగా అధికారులు అంచనాలు వేశారు. కానీ రూ.1,14,684 కోట్లతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఇందులో కేంద్రం నుంచి గ్రాంట్ల రూపంలో ఆశించిన సాయం దక్కలేదు. గడిచిన ఆర్థిక సంవత్సరం మొత్తం మీద కేంద్రం నుంచి రూ.50,695 కోట్లు వస్తుందని ఆశించినా వచ్చింది రూ.19,457 కోట్లే. అదే సమయంలో రాష్ట్ర పన్నుల ఆదాయమూ తగ్గింది. రూ.65,535 కోట్లు ఆశిస్తే వచ్చింది రూ.58,125 కోట్లే. 2018-19 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ప్రతిపాదన సమయంలో రెవెన్యూ మిగులు ఉంటుందని లెక్కించినా, ఆ అంచనాలు తప్పాయి. ప్రస్తుతం సవరించిన అంచనాల ప్రకారం.. రూ.11,654.90 కోట్లుగా రెవెన్యూ లోటు తేలింది.

## అప్పులు: పాపం వారిదే..

**ఈనాడు, అమరావతి:** రాష్ట్రంపై గత ప్రభుత్వం అప్పుల భారాన్ని మోపిందని రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ శాసనమండలిలో ధ్వజమెత్తారు. మండలి ఛైర్మన్ ఎండీ అహ్మద్ షరీఫ్ అధ్యక్షతన శుక్రవారం సభ ప్రారంభమైన తర్వాత ప్రశ్నోత్తరాల సమయంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం చెప్పారు. '2014 జూన్‌లో రాష్ట్ర విభజన సమయంలో రూ.1,30,654.34 కోట్ల అప్పులను కేటాయించారు. ఇందులో విభజించని ప్రజా పద్దు రూ.33,477.52 కోట్లు ఉంది. అప్పటినుంచి ఈ ఏడాది మే వరకు రాష్ట్ర ప్రభుత్వ నికర అప్పు రూ.1,00,658.37 కోట్లకు చేరింది' అని మంత్రి వివరించారు. ప్రతిపక్ష నేత, మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు దీనిని తోసిపుచ్చారు. ఉప ముఖ్యమంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ తాగు నీటి సమస్యకు గత ప్రభుత్వమే కారణమన్నారు. ప్రతి దానికీ గత ప్రభుత్వాన్ని నిందించడం సరికాదని యనమల చెప్పారు. వైకాపా నేతలు పాపం చేశారు కాబట్టే జైలుకి వెళ్లారని చెప్పారు. 'వివరాలన్నీ చెబితే తలకాయలు ఎక్కడ పెట్టుకోవాలో తెదేపా నేతలకు తెలియదు. మీరు పాపాలు చేశారు. మీరు జైలుకెళ్లే రోజులు దగ్గరలో ఉన్నాయి' అని బోస్ తిప్పికొట్టారు.

### అనుమతులున్న ఇసుక రీచ్‌లు 57: పెద్దిరెడ్డి

రాష్ట్రంలో 153 ఇసుక రీచ్‌లకు గానూ అన్ని అనుమతులతో ఉన్నవి 57 అని, పట్టా భూముల్లో 80 చోట్ల ఉన్నాయని పంచాయతీరాజ్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారు.

# విద్యారంభం కరిష్యామి!



పేదలకు పిల్లల చదువులు భారంగా తయారవుతున్నాయి. వారి ఆదాయంలో 40% పైగా దీనికే వెచ్చించాల్సి వస్తోంది. దీంతో ఎంతోమంది అప్పుల పాలవుతున్నారు, ఆస్తులు అమ్ముకుంటున్నారు. అందుకే వీరికి అండగా నిలబడేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక 'నవరత్నాల్లో' భాగంగా 'జగనన్న అమ్మఒడి' పథకాన్ని ప్రవేశపెట్టింది. దీనికి తోడు 'జగనన్న విద్యా దీవెన' కింద బోధన రుసుముల పూర్తి చెల్లింపు; ప్రైవేటు వసతి గృహాల్లో ఉన్న వారికి ఏటా రూ.20 వేలు ఇవ్వాలని తలపెట్టారు. సకల సదుపాయాలతో సర్కారీ బడులకు కొత్త కళ తేవాలని నడుం కట్టారు.

**గతేడాదితో పోల్చితే విద్యకు 34.87% నిధుల పెంపు**

**మొత్తం బడ్జెట్‌లో 14.31%**

రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేసింది. కేటాయింపులు పెంచడంతోపాటు కొత్త పథకాలకు శ్రీకారం చుట్టింది. గతేడాదితో పోల్చితే ఈ బడ్జెట్‌లో 34.87% నిధులను పెంచింది. మొత్తం బడ్జెట్‌లో 14.31% నిధులను విద్యకు కేటాయించింది. సాంకేతిక విద్య మినహా మొత్తంగా విద్యకు రూ.32,618.46 కోట్లు ఇచ్చింది. పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు విద్యార్థులను పంపే తల్లులకు 'జగనన్న అమ్మఒడి' కింద రూ.15 వేలు ఇవ్వనున్నారు. ఇందుకు బడ్జెట్‌లో రూ.6,455 కోట్లను కేటాయించారు. 'జగనన్న విద్యా దీవెన పథకం' కింద విద్యార్థులకు పూర్తిగా బోధన రుసుముల చెల్లింపు, భోజనం, ప్రయాణం, వసతి, పుస్తకాలకు ఏడాదికి ఒక్కో విద్యార్థికి రూ.20వేలు ఇవ్వనున్నారు. ఇందుకు రూ.4,962.3 కోట్లు కేటాయించారు. పాఠశాలల నిర్వహణకు ఇచ్చే నిధులను ఇక నుంచి వైఎస్సార్ పాఠశాలల నిర్వహణ నిధిగా పిలవనున్నారు. ఇందుకు రూ.160 కోట్లు చూపారు. పాఠశాలల్లో రెండేళ్లలో మౌలిక సదుపాయాల కల్పనకు ఈ ఏడాది రూ.1500 కోట్లు ఇచ్చారు. మధ్యాహ్న భోజనం సరఫరా బాధ్యతలను అక్షయపాత్రకు అప్పగించనున్నట్లు ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా కేంద్రీయ వంటశాలల నిర్మాణానికి రూ.100 కోట్లు కేటాయించారు.

### ఉన్నత విద్యకు 6.59% నిధుల పెంపు

ఉన్నత విద్యకు గతేడాది కంటే 6.59% నిధులను అదనంగా నిధులను కేటాయించారు. గతేడాది రూ.2,834.90 కోట్లు కేటాయించగా.. ప్రస్తుతం రూ.3,021.63 కోట్లు కేటాయించారు. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి రూ.4.29 కోట్లు, డాక్టర్. బీఆర్.అంబేడ్కర్ సార్వత్రిక వర్సిటీకి రూ.4.53 కోట్లు కేటాయించారు. రాజీవ్‌గాంధీ విజ్ఞాన, సాంకేతిక వర్సిటీకి రూ.41.16 కోట్లు, జేఎన్‌టీయూ అనంతపురానికి రూ.60 కోట్లు, జేఎన్‌టీయూ కాకినాడకు రూ.38.35 కోట్లు కేటాయించారు. సాంకేతిక వర్సిటీలు మినహా యూజీసీ-2016 వేతన బకాయిలు, సీపీబ్రౌన్ మెమోరియల్ గ్రంథాలయం కడపతో కలిపి మొత్తం విశ్వవిద్యాలయాలకు రూ.1,418.96 కోట్లు కేటాయించారు.

### సాంకేతిక విద్యకు తగ్గింపు..

సాంకేతిక విద్యాశాఖకు ఈసారి బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గాయి. గతేడాది రూ.818.02 కోట్లు కేటాయించగా.. ఈసారి రూ.580.29 కోట్లే ఇచ్చారు.

### ఉన్నత విద్యామండలికి రూ.2వేలు..

ఉన్నత విద్యామండలికి ఈ ఏడాది బడ్జెట్‌లో కేవలం రూ.0.02 లక్షలు కేటాయించారు. గతేడాదికి అసలు బడ్జెట్ కేటాయింపులే లేక పోగా ఈసారి రూ.2 వేలుగా చూపారు. 2017-18లో రూ.2.13 లక్షలు కేటాయించారు.

- ఈనాడు, అమరావతి

## జగనన్న అమ్మఒడి..

పిల్లలను ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు బడులు, జూనియర్ కాలేజీల్లో చదివించే పేద తల్లికి ఏడాదికి రూ.15,000 ప్రోత్సాహకం అందించనున్నారు.

**బడ్జెట్లో ఎంత కేటాయించారు:** రూ. 6,455 కోట్లు

- **ఉపయోగం :** చదువుల భారం తగ్గి పాఠశాలల్లో ప్రవేశాలు పెరుగుతాయి. చదువు మధ్యలో మానెయ్యటం తగ్గుతుంది. బాలకార్మిక సమస్యా తగ్గుతుంది.
- **అమలు:** జనవరి 26 నుంచి

**ఎంతమందికి?** పిల్లలను బడులకు, కాలేజీలకు పంపిస్తున్న పేద తల్లులను ఎంపిక చేసేందుకు తెల్లరేషన్ కార్డు ఉండాలి.

10 వరకు చదువుతున్న విద్యార్థులు: 70 లక్షలు | ఇంటర్మీడియట్ విద్యార్థులు: 9.65 లక్షలు

**తెల్లరేషన్‌కార్డు ఉన్న తల్లులు**

బడి స్థాయిలో: సుమారు 36,88,952 | జూనియర్ కళాశాల స్థాయిలో: 6,11,048

ఒక తల్లికి చదువుకునే పిల్లలు ఎంత మంది ఉన్నా రూ. 15 వేలే ఇస్తారు

## జగనన్న విద్యా దీవెన: వసతికి ఊతం

**ఇదీ పథకం..**

విద్యార్థులు ప్రైవేటు వసతిగృహాల్లో ఉంటే ఏటా రూ.50 వేల నుంచి రూ.80 వేల వరకూ ఖర్చవుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని వసతి, ప్రయాణం, పుస్తకాలు, భోజనాలకు ప్రతి విద్యార్థికీ ఏటా రూ.20 వేలు చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకంలో ప్రైవేటు వసతి గృహాల్లోని వారికి దాదాపు సగం భారం తగ్గుతుంది.

దీన్ని ఇంటర్ విద్యార్థులకు వర్తింపజేస్తారు, ఈ మొత్తం తల్లులకే ఇస్తారు.

| విద్యార్థుల సంఖ్య | ప్రస్తుత విధానంలో ఉపకారవేతనం | రూ.20 వేలు ఇస్తే ఖర్చు |
|---|---|---|
| 15,35,911 | రూ.1,226.05 కోట్లు | రూ. 1,810.56 కోట్లు |

బడ్జెట్లో ఎంత కేటాయించారు? : రూ. 1,810.56 కోట్లు

## బడులకు కొత్త కళ

**ఏమిటి లక్ష్యం:** రెండేళ్లల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలతో సర్కారీ బడులను కార్పొరేట్ బడులకు దీటుగా తయారు చెయ్యాలన్నది సంకల్పం.

**ఎంత అవసరం?**
ప్రభుత్వ పాఠశాలలు: 44,510
మౌలిక సదుపాయాల కల్పనకు కావాల్సింది: 8,012 కోట్లు
బడ్జెట్లో ఎంత కేటాయించారు: రూ. 1,500 కోట్లు

## బోధన రుసుముల పూర్తి చెల్లింపు

ఉన్నత విద్య చదువుతున్న పేద విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోంది. దీన్ని పెంచేందుకు ప్రభుత్వం బోధన రుసుములను పూర్తిగా చెల్లించి, ఉన్నత చదువులను ప్రోత్సహించాలని తలపెట్టింది.

**బడ్జెట్లో ఎంత కేటాయించారు?:** రూ. 3,151.74 కోట్లు

**అమలు ఎలా?**
ప్రస్తుతం సాధారణ డిగ్రీ, వృత్తి విద్యా కోర్సుల విద్యార్థులకు కొన్ని పరిమితులతో 'బోధన రుసుముల చెల్లింపు' జరుగుతోంది. ఉదాహరణకు ఎస్సీ, ఎస్టీలు మినహా మిగతా వారు ఇంజినీరింగ్ వంటి కోర్సుల్లో పది వేలకు పైగా ర్యాంకులతో కన్వీనర్ కోటా కింద సీటు తెచ్చుకుంటే ఏడాదికి రూ.35 వేలు చెల్లిస్తున్నారు. మిగతా మొత్తాన్ని విద్యార్థులే భరిస్తున్నారు. ఇప్పుడు ప్రభుత్వం రుసుము మొత్తాన్ని తానే చెల్లించి, ఉచితంగా ఉన్నత విద్య అందించేలా ఈ కొత్త పథకం తెచ్చింది.

| | |
|---|---|
| విద్యార్థులు | 15,35,911 |
| చెల్లింపులు | రూ. 2,070.61 కోట్లు |

# నిజమా.. కల్పితమా!

**గత ప్రభుత్వ రెండంకెల వృద్ధి రేటు లెక్కలపై ఆర్థిక మంత్రి బుగ్గన వ్యాఖ్య**



**ఈనాడు, అమరావతి:** 'ఆర్థిక వ్యవస్థలో రెండంకెల వృద్ధి సాధించామని గత ప్రభుత్వం ప్రకటించుకుంది. ఈ అంకెలు నిజమైనవా? కల్పితమా? అనేది నిర్ధరించుకుంటున్నాం. రెండంకెల వృద్ధి రేటే ఉంటే అన్నదాత ఆకలితో ఎందుకున్నాడు? అక్కాచెల్లెళ్లలో విషాదం, యువతలో అసంతృప్తి ఎందుకుంది? మార్పు కోసం ఇంత భారీగా, నిర్ణయాత్మక ఓటు ఎలా వేశారనేది ఆలోచించాలి. రెండంకెల వృద్ధిరేటు నిజమే అయితే మాత్రం.. వృద్ధిని వక్రీకరించి ధనవంతులను మరింత ధనవంతులుగా, పేదలను మరింత పేదలుగా చేసి వృద్ధి వనరులను కొద్ది మంది చేతుల్లో కేంద్రీకృతం చేశారని అర్థం' అని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. దేశ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా అత్యంత దయనీయ ఆర్థిక స్థితిని తమ ప్రభుత్వం వారసత్వంగా పొందిందని వివరించారు. రాష్ట్ర విభజననాటికి ఉన్న అప్పు అయిదేళ్లలో విపరీతంగా పెరిగిందని వ్యాఖ్యానించారు. 2019-20 ఆర్థిక సంవత్సరానికిగాను రాష్ట్ర శాసనసభలో శుక్రవారం ఆయన బడ్జెట్ ప్రవేశపెట్టారు. శాసనమండలిలో ఉప ముఖ్యమంత్రి పిల్లి సుభాష్‌చంద్రబోస్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. శాసనసభలో ఆర్థిక మంత్రి మాట్లాడుతూ.. 2022నాటికి రాష్ట్రంలో లేమితనం లేకుండా చూడాలని భావిస్తున్నామన్నారు. రాష్ట్రానికున్న పరిమిత ఆదాయాల్లోనే ఖర్చులు భరించాల్సి ఉందని, ఈ ప్రభుత్వానికి ప్రాప్తించిన ద్రవ్య స్థితి వల్ల కఠిన ప్రత్యామ్నాయాలను చూసుకోవాల్సి వచ్చిందని వ్యాఖ్యానించారు. తొలుత నిర్ణయించుకున్న ప్రకారం ఉదయం 11 గంటలకే బడ్జెట్ ప్రవేశపెట్టాల్సి ఉన్నప్పటికీ రాహుకాలం ఉండటంతో మధ్యాహ్నం 12.22 గంటలకు ప్రవేశపెట్టారు. బడ్జెట్ ప్రసంగంలో ఆయన సంస్కృత శ్లోకాలు, గాంధీజీ, అంబేడ్కర్, ఠాగూర్ సూక్తులు, చాణక్య నీతి సూత్రాలను మేళవించారు.

"విభజన తర్వాత తెలంగాణ రాష్ట్ర తలసరి రాబడి రూపాయి ఉండగా, ఏపీ తలసరి రాబడి సుమారు 60 పైసలకు పడిపోయింది. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని ప్రధాని, కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాం. సింగపూర్ అంతర్జాతీయ విమానాలకు లోటు భర్తీ నిధి (వయబిలిటీ గ్యాప్ ఫండింగ్) సమకూర్చాలా లేదా పేలాది తల్లులు, పిల్లలకు మెరుగైన పోషకాహారాన్ని అందించాలా? అంటే మొదటి దానికి మా ప్రాధాన్యం ఉండదు. మా మనస్సాక్షి ఎంపికలు స్పష్టంగా ఉన్నాయి. గోదావరి జలాలను శ్రీశైలానికి తీసుకొచ్చి రాయలసీమకు నీటినందిస్తాం. కృష్ణా ఆయకట్టును స్థిరీకరిస్తాం. ప్రతి గ్రామం, కుటుంబానికి తాగునీటిని సమకూరుస్తాం. పోలవరం, వంశధార, గాలేరు నగరి, హంద్రీనీవా, వెలిగొండ, ఇతర ముఖ్యమైన ప్రాజెక్టులు.. ప్రత్యేకించి ఉత్తరాంధ్రలో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేస్తాం. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమ బోధనను ప్రవేశపెడతాం. తెలుగును తప్పనిసరి చేసి భాష ప్రాముఖ్యాన్ని కొనసాగిస్తాం. మెట్రిక్ అనంతర కోర్సులు చదివే విద్యార్థుల కోసం జగనన్న విద్యాదీవెన పథకాన్ని అమలు చేస్తాం. అన్ని కులాలవారికి పూర్తి ఫీజు రీఎంబర్స్‌మెంట్ సమకూరుస్తాం. ప్రఖ్యాత శాస్త్రవేత్త ఎడిసన్‌ను ఆయన తల్లి తీర్చిదిద్దింది. ఈ స్ఫూర్తితోనే అమ్మ ఒడి పథకాన్ని రూపొందించాం. పథకం ఆలోచనంతా జగన్‌దే. అందుకే ఈ పథకానికి 'జగనన్న అమ్మ ఒడి పథకం'గా పేరు పెట్టాం. మేము ఎన్నోసార్లు బతిమిలాడాక ఆయన పేరు పెట్టేందుకు అంగీకరించారు. అమ్మ ఒడి పథకాన్ని ఇంటర్ విద్యార్థులకూ వర్తింపజేస్తాం. నెలకు రూ.40 వేల ఆదాయం కలిగిన మధ్య తరగతి కుటుంబాలకూ ఆరోగ్యశ్రీ వర్తింపజేస్తాం. ప్రతి మండలానికి 108 అంబులెన్స్ ఉండేలా చూస్తాం. రెండేళ్లలో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులను ఉత్తమ కార్పొరేట్ ఆసుపత్రులుగా మారుస్తాం" అని ఆర్థిక మంత్రి బుగ్గన వివరించారు.

## రంగాల వారీగా బడ్జెట్ కేటాయింపులు

| పథకం | 2018–19 (కేటాయింపులు రూ.కోట్లలో) | 2019–20 (కేటాయింపులు రూ.కోట్లలో) | పెరుగుదల శాతం |
|---|---|---|---|
| **ఆర్థిక సేవలు** | **67,917.56** | **86,185.63** | **26.90** |
| వ్యవసాయం, అనుబంధ సేవలు | 12,355.32 | 20,677.08 | 67.35 |
| గ్రామీణాభివృద్ధి | 20,815.98 | 29,329.98 | 40.90 |
| నీటి పారుదల, వరద నియంత్రణ | 16,978.23 | 13,139.05 | -22.61 |
| విద్యుత్ | 4,193.30 | 6,861.03 | 63.62 |
| పారిశ్రామిక ఖనిజాలు | 4,021.47 | 3,986.05 | -0.88 |
| రవాణా | 4,653.74 | 6,157.25 | 32.31 |
| సాధారణ పర్యావరణ సేవలు | 4,890.62 | 6,025.27 | 23.20 |
| **సామాజిక సేవలు** | **67,032.91** | **75,465.02** | **12.58** |
| సాధారణ విద్య | 24,185.75 | 32,618.46 | 34.87 |
| క్రీడలు, యువజన సేవలు | 1,635.44 | 329.68 | -79.84 |
| సాంకేతిక విద్య | 818.02 | 580.29 | -29.06 |
| కళలు, సంస్కృతికం | 94.98 | 77.67 | -18.22 |
| వైద్యం | 8,463.51 | 11,399.23 | 34.69 |
| నీటి సరఫరా, పారిశుద్ధ్యం | 2,623.23 | 2,234.77 | -14.81 |
| గృహ నిర్మాణం | 3,679.53 | 3,617.37 | -1.69 |
| పట్టణాభివృద్ధి | 7,740.80 | 6,587.09 | -14.90 |
| సమాచార, పౌర సంబంధాలు | 224.81 | 191.02 | -15.03 |
| సంక్షేమం | 13,722.98 | 14,142.99 | 3.06 |
| కార్మిక, ఉపాధి కల్పన | 814.83 | 978.58 | 20.10 |
| సామాజిక భద్రత, సంక్షేమం | 3,029.03 | 2,707.86 | -10.60 |
| **సాధారణ సేవలు** | **56,113.14** | **66,324.35** | **18.20** |
| **మొత్తం** | **1,91,063.61** | **2,27974.99** | **19.32** |

**దేనికెంత? (రూ. కోట్లలో)**

| న్యాయశాఖ | శాసన సభ | పురపాలిక, పట్టణాభివృద్ధి | మైనార్టీ సంక్షేమం | యువజన, క్రీడలు | ప్రణాళిక |
|---|---|---|---|---|---|
| 937.37 | 121.17 | 6,587.09 | 952.47 | 604.55 | 1,439.55 |

# వసుంధర

## జిడ్డు చర్మానికి ఉప్పు నీళ్లు

ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా కొందరి ముఖం ఎప్పుడూ జిడ్డుగా కనిపిస్తుంది. ఆ సమస్యను అదుపులో ఉంచాలంటే...



- ముఖం కడుక్కుంటున్నప్పుడు మొదట చల్లని నీరే వాడాలి. చర్మంలోని జిడ్డు, మురికిని తొలగించడంలో ఇదెంతో మేలు చేస్తుంది. ఆ తరువాత గోరువెచ్చని నీటితో మరోసారి కడిగి, పొడి వస్త్రంతో అద్దినట్లు తుడుచుకోవాలి. ఆ వెంటనే చల్లని నీటిని ముఖంపై చల్లుకుంటే చర్మ రంధ్రాలు మూసుకుపోతాయి. ఇలా రోజులో రెండుసార్లు చేయగలిగితే ముఖంపై మొటిమలు వచ్చే అవకాశం తగ్గుతుంది.
- చర్మంలోని అధిక నూనెను నియంత్రించాలంటే ఎప్పటికప్పుడు బ్లాటింగ్ లేదా టిష్యూ కాగితంతో ముఖాన్ని అద్దుకోవాలి. వెనిగర్ లేదా గ్రీన్ టీకి గులాబీ నీరు కలిపి ముఖానికి రాసుకోవాలి. ఇది టోనర్‌లా పనిచేసి జిడ్డు సమస్యను అదుపులో ఉంచుతుంది.
- వారానికి రెండు లేదా మూడు సార్లు పాలల్లో కొద్దిగా తేనె కలిపి ముఖానికి రాయాలి. ఆరిన తరువాత చల్లని నీటితో శుభ్రపరుచుకుంటే జిడ్డు సమస్య చాలావరకూ తగ్గుతుంది.
- సెనగపిండి, పెరుగు కలిపి ముఖానికి పూతలా వేయాలి. పదిహేను నిమిషాలయ్యాక శుభ్రం చేస్తే ముఖంపై పేరుకున్న మురికి తొలగిపోవడమే కాదు... చర్మం తాజాగా మారుతుంది.

### ఉప్పునీరు

మంచినీటిలో కొంచెం ఉప్పు కలిపి దాన్ని స్ప్రే సీసాలో నింపాలి. ముఖాన్ని శుభ్రం చేసుకుని ఈ ఉప్పునీటిని స్ప్రే చేసుకోవాలి. ఈ నీరు చర్మంలోని జిడ్డును నియంత్రిస్తుంది. ఇలా రోజులో రెండు లేదా మూడు సార్లు చేస్తే కొద్ది రోజుల్లోనే ముఖంపై జిడ్డు దూరమవుతుంది.

## రోజుకో గ్లాస్... క్యారెట్ జ్యూస్

వంటల్లో క్యారెట్ వాడటం, అప్పుడప్పుడూ పచ్చిగా తినడం మాత్రమే కాదు, రోజూ గ్లాసు రసం తాగి చూడండి. ఎన్ని లాభాలుంటాయో!

- క్యారెట్‌లో బీటా కెరొటిన్ ఎక్కువ. ఇది శరీరంలోకి వెళ్లిన తరువాత విటమిన్-ఎగా మారుతుంది. ఈ రసం తాగడం వల్ల కళ్లు ఆరోగ్యంగా ఉంటాయి.
- ఇందులో కెరొటినాయిడ్లు అధికం. ఇవి యాంటీఆక్సిడెంట్లలా పనిచేసి శరీరంలోని మలినాలను బయటకు పంపిస్తాయి. శరీరానికి హాని చేసే ఫ్రీ రాడికల్స్‌తో పోరాడతాయి. ఒత్తిడిని తగ్గించి జీవక్రియలు సాఫీగా జరిగేలా చూస్తాయి.
- క్యారెట్‌లోని పోషకాలకు క్యాన్సర్ కణాలతో పోరాడే శక్తి ఉందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి.



- ఈ రసం తాగడం వల్ల ముఖంపై ముడతలు తగ్గుముఖం పడతాయి. చర్మం కాంతిమంతంగా మారుతుంది. ఇందులోని విటమిన్-సి, యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి.
- ఆహారం సరిగా జీర్ణం కాకపోవడం, మలబద్ధకం సమస్యలున్నవారు రోజూ గ్లాసు క్యారెట్ రసం తాగితే జీర్ణక్రియ సక్రమంగా జరుగుతుంది. ఇందులోని పీచు మలబద్ధకాన్ని నివారిస్తుంది.
- బరువు తగ్గాలన్నా, జీవక్రియలను మెరుగుపరుచుకోవాలనుకున్నా, శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపాలనుకున్నా... రోజూ గ్లాసు క్యారెట్ రసం తాగితే చాలు. త్వరగా ఆకలి వేయదు.
- క్యారెట్‌లోని పొటాషియం చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. రక్తపోటును నియంత్రిస్తుంది. థైరాయిడ్, అధిక కొలెస్ట్రాల్‌తో బాధపడేవారు ఈ రసం రోజూ తాగితే మంచిది.

## మెకానిక్ మైనా!

యాభై రెండేళ్ల మైనా చేసే పని చాలామంది మహిళలతో పోలిస్తే భిన్నం. ఎందుకో తెలుసుకోవాలనుకుంటున్నారా... ఇది చదివేయండి మరి.



మైనాది మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని మందసౌర్ పట్టణం నుంచి ఎనిమిది కిలోమీటర్ల దూరంలోని నయాఖేడా అనే గ్రామం. మందసౌర్ బైపాస్ హైవేపై ఆమెకో మెకానిక్ షెడ్డు ఉంది. సైకిల్, బైక్ లాంటి చిన్న చిన్న వాటికే కాకుండా కారు, జీప్, ట్రక్ లాంటి భారీ వాహనాల టైర్లకు పంక్చర్లు వేస్తూ, మరమ్మతులు చేస్తుంది. భారీగా ఉండే ట్రక్కుల టైర్లను సొంతంగా తొలగించి మరమ్మతు చేసి మళ్లీ బిగిస్తుంది. ఏ వేళలో, ఏ వాతావరణంలోనైనా ఆమె మెకానిక్ షెడ్డు పనిచేయడం విశేషం.

మైనా తండ్రి మెకానిక్. చిన్నప్పటి నుంచి ఆయనకు పనిలో సాయం చేసేది. కొన్నాళ్లకు ఆమెకు పెళ్లి చేశారు. ఇద్దరు అమ్మాయిలు పుట్టారు. మూడో బిడ్డ కడుపులో ఉన్నప్పుడు భర్త చనిపోయాడు. అంతకు ముందే ఆమె కన్నతండ్రీ కన్ను మూశాడు. ఏ ఆధారం లేక బిడ్డలతో పుట్టింటికి చేరింది. అక్కడా తోబుట్టువులు చిన్నవాళ్లు కావడంతో కుటుంబ పోషణ కోసం ఏదైనా పని చేయాలనుకుంది. పెద్దగా చదువుకోకపోవడంతో మెకానిక్ పనినే ఉపాధిగా ఎంచుకుంది.

### ఇబ్బందులు తప్పలేదు...

హైవే మీద చిన్న గుడిసె వేసుకుని దాన్నే షెడ్డుగా మార్చుకుంది. మొదట్లో కేవలం సైకిళ్లు, బైక్ టైర్లకు పంక్చర్లు వేస్తూ మరమ్మతులు చేసేది. క్రమంగా పెద్ద వాహనాలకు రిపేర్లు చేయడం మొదలుపెట్టింది. ట్రక్కుల్లాంటివి మరమ్మతులు చేసే సమయంలో చాలా కష్టపడాల్సి వచ్చేది. దానికితోడు చుట్టుపక్కలవాళ్లు, బంధువుల అవహేళనలను ఎదుర్కోవాల్సి వచ్చేది. 'మగవాళ్లు చేసే ఈ మెకానిక్ పని నీకెందుకు... మరేదైనా పని చేసుకోవచ్చుగా...' అనేవారట. 'మహిళలు బలహీనులు కారు. తలచుకుంటే వాళ్ల కాళ్లపై వాళ్లు నిలబడగలరని నిరూపించాలనుకున్నా. ఎంత కష్టమైనా పంటి బిగువున భరిస్తూ పనిచేస్తున్నా...' అని చెబుతోంది. పిల్లల్ని హాస్టల్‌లో ఉంచి చదివించుకుంది. దాదాపు ఇరవై ఏళ్లుగా ఈ పని చేస్తోంది. ఆమె పిల్లలు ఇప్పుడు పెద్దవాళ్లై ప్రయోజకులుగా మారినా ఆమె తను చేసే పనిని వదల్లేదు.

'అంతర్జాతీయ అంతరిక్ష విశ్వవిద్యాలయం'లో పరిశోధన చేయాలని, శిక్షణ తీసుకోవాలనేది ఎందరో శాస్త్రవేత్తల కల. తెలుగమ్మాయి నిఖితకు ఆ అవకాశం అనుకోకుండానే వచ్చింది. శాస్త్ర సాంకేతిక రంగంలోకి రావాలనుకునే విద్యార్థులకు ఆమె కల్పిస్తోన్న అవగాహనతోనే ఆ ఛాన్స్ కొట్టేసింది. కల్పనా చావ్లా జ్ఞాపకార్థం అందించే ఉపకార వేతనమూ అందుకుంది. ఇంతకీ ఆమె ఏం చేస్తుందో వివరించిందిలా...

# నాసా శిక్షణకు ఈ నలుగురు...



అనంత విశ్వం అంటే... అంతరిక్ష పరిశోధనలు ఎక్కడ చేస్తారు...రాకెట్ రయ్‌మని ఎలా దూసుకుపోతుంది... చిన్నప్పుడు నాకూ ఇలాంటి సందేహాలెన్నో వచ్చేవి. వాటిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, ఈ రంగంలోకి రావాలనుకునే విద్యార్థులకు తెలియజేయాలనుకున్నా. ఆ ఆలోచనతోనే 'సొసైటీ ఫర్ స్పేస్ ఎడ్యుకేషన్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్' అనే సంస్థను ప్రారంభించా. నేను పుట్టి, పెరిగింది బెంగళూరులో అయినా మా స్వస్థలం కర్నూలు. మా నాన్న దర్జీ. అమ్మ టీచర్. అంతా ఇంజినీరింగ్, మెడిసిన్ గురించి ఆలోచిస్తుంటే... నేను వ్యోమగామిని కావాలనుకునేదాన్ని. ఆదే లక్ష్యంతో బెంగళూరులోని అలయన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ డిజైన్‌లో ఏరోస్పేస్ ఇంజినీరింగ్ పూర్తి చేశా.

> నిఖిత నేషనల్ ఏరోస్పేస్ ల్యాబొరేటరీలో ప్రాజెక్టులు రూపొందించింది. ఐఐటీ, కాన్పూర్ నుంచి ఫ్లైట్ ల్యాబ్ ట్రైనింగ్‌లో శిక్షణ పొందింది. సొసైటీ ఫర్ ఇస్రో నిర్వహించిన పోటీల్లో బెస్ట్ టీచర్ అవార్డు అందుకుంది. కర్ణాటక సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమీ బెస్ట్ సైన్స్ కమ్యూనికేటర్ అవార్డు అందుకుంది. ఆమె గణితం, సైన్స్ టీచర్ కూడా.

### శాస్త్రవేత్తలను తయారుచేయాలని...

మా కాలేజీలో స్పేస్ క్లబ్ ఉండేది. అందులో అంతరిక్షానికి సంబంధించిన విద్యపై అవగాహన కల్పించేవారు. అదీ కేవలం మా కళాశాల విద్యార్థులకు మాత్రమే. నా లక్ష్యం వ్యోమగామి కావడం. అయితే నా శరీర ఎత్తు అందుకు సరిపోదని తెలిసింది. నేను కాలేకపోయినా ఇతర విద్యార్థులకు ఆ విజ్ఞానాన్ని అందించాలనుకున్నా. ఓ కార్యక్రమంలో ఇలాంటి ఆలోచనలే ఉన్న సుజయ్ కృష్ణతో పరిచయం అయ్యింది. అతనిది కేరళ. ఇద్దరం కలిసి శాస్త్ర, సాంకేతిక రంగంపై వీలైనంతమంది విద్యార్థులకు అవగాహన కల్పించాలనుకున్నాం. స్పష్టమైన ప్రణాళికతో నా ఇంజినీరింగ్ కాకముందే... ఇద్దరం కలిసి 2016లో 'సొసైటీ ఫర్ స్పేస్ ఎడ్యుకేషన్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్' అనే స్వచ్ఛంద సంస్థను ప్రారంభించాం. మా సంస్థ ద్వారా పాఠశాలలు, కళాశాలల్లో కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థుల్లో అంతరిక్ష విద్యపై అవగాహన కల్పిస్తాం. తెలంగాణలోని బాసర ట్రిపుల్ ఐటీ, హైదరాబాద్‌తో కలిపి ఇప్పటి వరకు నాలుగు వేల మందికి పైగా విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాం. ఇటీవల సంగారెడ్డితోపాటు, బెంగళూరులోని కొన్ని ప్రభుత్వ పాఠశాలలను ఎంపికచేసి మరి కొన్ని కార్యక్రమాలు చేయబోతున్నాం. ఏ పాఠశాల అయినా సరే... ఆసక్తి ఉన్న ముప్పై మంది విద్యార్థులను ఎంపిక చేస్తాం. వీరికి వారంలో ఒక రోజు ఇస్రో శాస్త్రవేత్తలు, ఇతర నిపుణులతో శిక్షణా కార్యక్రమం ఉంటుంది శాస్త్రవిజ్ఞానానికి సంబంధించిన మ్యూజియంలు, రాకెట్, చిన్న చిన్న విమానాల పనితీరు తెలియజేస్తాం. ప్రభుత్వ పాఠశాలలో ఇలాంటి కార్యక్రమం ఏర్పాటు చేయడానికి మాకు అక్షయ పాత్ర ఫౌండేషన్ నిధులు సమకూరుస్తోంది. అదే ప్రైవేటు పాఠశాల విద్యార్థులైతే అందుకు అయ్యే ఖర్చును భరించాల్సి ఉంటుంది. మేం ఇస్రో, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏరో ఫిజిక్స్‌తోనూ మేం అనుసంధానం అయ్యాం. త్వరలో కేరళలోనూ మా సేవల్ని విస్తరించబోతున్నాం. భారత్‌లోనే కాకుండా... ఫిలిప్పైన్స్, మారిషస్, శ్రీలంకలోనూ శిక్షణ అందిస్తున్నాం. మొదట్లో మా పెద్దవాళ్లకు మేం ఓ సంస్థ పెట్టబోతున్నామని చెబితే... 'బాగా చదువుకున్నారు. ఇవన్నీ మీకెందుకు. ఏదైనా మంచి ఉద్యోగం చేసుకోవచ్చు కదా' అని అన్నారు. సంస్థ పెట్టిన ఏడాదిన్నర తరువాత మా విజయాలు చూసి అంగీకరించారు. మొదట్లో నిధులు సమకూర్చుకోవడం ప్రారంభంలో కొద్దిగా కష్టమైంది. నేను ట్యూషన్లు చెప్పి, ఆ డబ్బును దీనికి ఉపయోగించేదాన్ని. ఇప్పుడు ఏ ఇబ్బందీ లేదు. ఇవన్నీ కలిపి నాకు కల్పనాచావ్లా ఉపకారవేతనంతోపాటు అంతర్జాతీయ అంతరిక్ష విశ్వవిద్యాలయంలో శిక్షణ తీసుకునే అవకాశం తెచ్చిపెట్టాయి. నాతోపాటు మరో ముగ్గురు విద్యార్థులు ఈ శిక్షణలో పాల్గొనబోతున్నారు. కల్పనా చావ్లా పురస్కారం సైతం అందుకోనున్నారు.

### కల్పనా చావ్లా అవార్డు ఎవరిస్తారంటే...

మైకేల్ పాటర్ అనే వ్యక్తి కల్పనా చావ్లా జ్ఞాపకార్థం ఈ స్కాలర్‌షిప్ ప్రోగ్రాంను ప్రారంభించారు. ఆయన చావ్లా స్నేహితుడు. ఈ కార్యక్రమం కింద దేశంలో శాస్త్రవిజ్ఞాన శాస్త్రంలో ప్రతిభ కనబరిచే మహిళలకు మూడేళ్లుగా ఆర్థిక చేయూత అందిస్తున్నారు.

### ఉపకారవేతనానికి ఇలా...

ఫ్రాన్స్‌లోని అంతర్జాతీయ అంతరిక్ష విశ్వవిద్యాలయానికి ప్రపంచం నలుమూలల నుంచి దరఖాస్తులు రాగా అందులో 120 మంది అర్హత సాధించారు. భారత దేశం నుంచి 12 మంది ఈ శిక్షణలో పాల్గొంటున్నారు. వీరిలో ఏడుగురు ఇస్రో శాస్త్రవేత్తలు. మిగిలిన వారిలో నిఖిత కాకుండా మరో ముగ్గురు అమ్మాయిలు, ఓ అబ్బాయి ఉన్నారు. వీళ్లు కల్పనా చావ్లా పురస్కారానికి ఎంపికయ్యారు. ఇంతకీ వాళ్లెవరంటే...

- నిత్యా పాండేది ఛత్తీస్‌గఢ్‌లోని చిన్న గ్రామం. బాల్యం నుంచే ఆమెకు అనంత విశ్వం అంటే ఆసక్తి. డిగ్రీలో ఫిజిక్స్, మ్యాథ్స్, కెమిస్ట్రీ ఎంపిక చేసుకుంది. ఆ తరువాత ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్‌లో పీజీ పూర్తి చేసింది.
- అదితి నీలవర్ణది మహారాష్ట్రలోని థానే. ముంబయిలోని ఎన్ఎంఐఎంఎస్ విశ్వవిద్యాలయం నుంచి 2017లో మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసింది. ఆమెకూ బాల్యం నుంచే అంతరిక్షం గురించి తెలుసుకోవాలని కోరిక. అప్పటి నుంచే అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి పెంచుకుంది. ఆమె బాస్కెట్ బాల్, వాలీబాల్ క్రీడాకారిణి కూడా.
- రుషాంక అమృత్కర్ ప్రస్తుతం పీహెచ్‌డీ చేస్తోంది. ముంబయి ఐఐటీలో టీచింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తోంది. రాయల్ ఆస్ట్రానమీ సొసైటీలో సభ్యురాలు. మూడు పుస్తకాలు రాసింది. శాటిలైట్ రిమోట్ సెన్సింగ్‌లో నిపుణురాలు. స్టెమ్‌లో సభ్యులైన వారికి అవసరమైన చేయూత అందిస్తోంది.

మిగిలిన శాస్త్రవేత్తలతోపాటు ఈ నలుగురు అంతరిక్ష విశ్వవిద్యాలయంలో రెండు నెలలపాటు శిక్షణ తీసుకుంటున్నారు. స్పేస్ పాలసీ, కొత్త సంస్థల ఏర్పాటు, స్పేస్ ఇంజినీరింగ్, ఆస్ట్రానమీ గురించి ఇందులో తర్ఫీదునిస్తారు. ఇక్కడికి ప్రపంచ ప్రఖ్యాతి పొందిన శాస్త్రవేత్తలు, స్పేస్ లాయర్లు, స్పేస్ డాక్టర్లు... వచ్చి పాఠాలు చెబుతారు.



నిఖిత నిత్యా పాండే అదితి నీలవర్ణ రుషాంక అమృత్కర్

## పెళ్లయ్యాకా అదే పరిస్థితి!

నాకు పాతికేళ్లు. మొదటినుంచీ నెలసరి సరిగ్గా రాదు. పెళ్లయ్యాక ఈ సమస్య తగ్గుతుందని అన్నారు. ఏడాది క్రితం పెళ్లయ్యింది. అయినా మార్పు లేదు. చివరకు అన్నిరకాల పరీక్షలు చేయించుకున్నా ఫలానా కారణం అని తెలియడంలేదు. దీనికి ఏదైనా పరిష్కారం ఉందా?

– ఓ సోదరి

నెలసరి సరిగ్గా రావడానికి ఓ ప్రక్రియ ఉంటుంది. మొదట మెదడు నుంచి హార్మోన్లు విడుదలై, అండాశయాన్ని ప్రభావితం చేస్తాయి. దాంతో అండం విడుదల అవుతుంది. అది జరిగిన పదిహేను రోజులకు నెలసరి వస్తుంది. మరికొన్ని హార్మోన్ల పనితీరు సజావుగా సాగాలి. ఒకవేళ ఎప్పుడైనా తేడా జరిగితే... ఆ ప్రభావం అండాశయంపై పడుతుంది. అది అండం విడుదలలో ఆటంకం కలిగిస్తుంది. దాంతో నెలసరి అదుపు తప్పుతుంది. ఇవి కాకుండా థైరాయిడ్, పీసీఓఎస్ (పాలిసిస్టిక్ ఒవేరియన్ సిండ్రోమ్) వంటి సమస్యలున్నా ఇలా కావొచ్చు. వీటన్నింటికీ పెళ్లితో సంబంధంలేదు. ఈ హార్మోన్ల అసమతూకం ముందు నుంచీ ఉండొచ్చు. ప్రసవం అయ్యాకా కొనసాగొచ్చు. ఒకవేళ మీరు గర్భనిరోధక మాత్రలు వాడి, మానేసినా ఈ సమస్య మళ్లీ ఎదురుకావొచ్చు. ముందు మీరు ఏ హార్మోన్ల లోపం ఉందో తెలుసుకోవాలి. ఆ తరువాత వెంటనే గర్భం దాల్చాలనుకుంటున్నారా... కొన్నాళ్లు ఆగాలనుకుంటున్నారా అనేదీ మీరిద్దరూ చర్చించుకోవాలి. వెంటనే పిల్లల్ని కనాలనుకుంటే చికిత్స తీసుకోవాలి. అప్పుడే పిల్లలు వద్దనుకుంటే గర్భనిరోధక మాత్రలు వాడుతూనే... హార్మోన్ల అసమతూకాన్ని నియంత్రించేందుకు చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. పిల్లలు కావాలనుకున్నప్పుడు అండం విడుదల కోసం మాత్రల్ని వాడితే చాలు. ఆహారంలో విషయంలో కొన్ని మార్పులు చేసుకోవడమూ ముఖ్యమే. వ్యాయామం చేస్తూ, ఒత్తిడిని అదుపులో ఉంచుకుంటే... నెలసరి సక్రమంగానే వస్తుంది. మీరు మరోసారి వైద్యుల్ని సంప్రదించడం మంచిది.

డియర్ వసుంధర



డా॥ అనగాని మంజుల
గైనకాలజిస్టు

– మీ సందేహాలను, సమస్యల్ని vasuhealth@eenadu.net కు పంపించగలరు.

## అహో గులాబీ!

నందనవనం



**రంగు రంగుల గులాబీల్ని చూస్తే మనసు మురిసిపోతుంది. వరండా, బాల్కనీ... ఇలా ఎక్కడ ఏ కాస్త చోటు ఉన్నా ఈ మొక్కల్ని సులువుగా పెంచుకోవచ్చు. అదే వీటిని సేంద్రియంగా పెంచుకోగలిగితే గులాబీ రేకలతో గులాబీ నీరు, బెల్లం, చక్కెరతో కలిపి గుల్కండ్ వంటివి తయారు చేసుకోవచ్చు. అసలు ఈ మొక్కల్ని ఎలా పెంచుకోవాలో తెలుసుకుందామా!**

గులాబీల్లో ఎన్నో రకాలు ఉన్నా ఎరుపు, పసుపు, తెలుపు, గులాబీ రంగు పూల మొక్కలకు ఆదరణ ఎక్కువ. వీటిని నాటుకునే ముందు చీడపీడల్ని తట్టుకునే రకాల్ని ఎంచుకోవాలి. సంవత్సరంలో మూడు, నాలుగు దఫాలుగా వీటికి అంటుకట్టి కొత్త మొక్కల్ని పెంచుకోవచ్చు.

**ఎత్తుని బట్టి...** మొక్క ఎదిగే తీరుని బట్టి కుండీలను ఎంచుకోవాలి. పొట్టి గులాబీలకు పన్నెండు అంగుళాలు... ఫ్లోరిబండా, చిన్న హైబ్రీడ్, పెద్ద హైబ్రీడ్ రకాలకు పద్దెనిమిది అంగుళాల్లో కుండీలను వాడాలి. అవి లోతుగా, వేర్ల పెరుగుదలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలి. గులాబీ మొక్కల్ని పెంచేందుకు అవసరమైన మట్టిని సిద్ధం చేసుకోవాలి. ఎర్రమట్టి, తేమని నిలిపే కొబ్బరిపీచు (కోకోపీట్), కొంత వర్మీ కంపోస్టు కలిపి కుండీలో నింపాలి. దానికి అడుగున రంధ్రం చేస్తే మిగులు నీరు బయటికి పోతుంది. ఈ మట్టి మొత్తం తడిసేలా దశల వారీగా నీటిని అందించాలి. మొక్కని నేరుగా కుండీల్లో నాటాలనుకున్నప్పుడు వేర్లు కుండీలో అన్ని వైపులకు సమానంగా వ్యాపించాలి. అవి రెండు అంగుళాల లోతులో ఉండేలా చూసుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ ద్రవ, ఘన రూప ఎరువులను కొత్త వేళ్లకు తగిలేలా ఉంచకూడదు. అలాచేస్తే మొక్కలు మొదట్లోనే చనిపోయే ప్రమాదం ఉంది.

**ఆధారం ఇవ్వాలి...** గులాబీ మొక్కల్ని గాలి సోకే ప్రాంతాల్లో, మిద్దెలమీద పెంచుతుంటారు. అవి పొడవుగా ఎదిగే మొక్కలైతే త్వరగా విరిగిపోవచ్చు. ఆ సమస్య ఎదురుకాకుండా మొక్కలకు తగిన ఊతమివ్వాలి. ఎప్పటికప్పుడు ఎండిన పూలను, కొమ్మల్ని కత్తిరించుకుంటే మొక్కలు చక్కగా పెరుగుతాయి. ఎక్కువ పూలు పూస్తాయి.

పెంచే రకాన్ని బట్టి పోషణ అందించాలి. రెండు వారాలకోసారి ఎన్‌పీకే ఉండే ద్రవరూప ఎరువుల్ని అందించాలి. వర్మీకంపోస్టు, పశువుల పేడ వంటి సేంద్రియ ఎరువులను మొక్కలకు వినియోగించవచ్చు. వీటన్నింటివల్లా అన్ని పోషకాలు సమపాళ్లల్లో అందుతాయి. మూడు నుంచి ఐదు సంవత్సరాల వరకూ ఆ కుండీలు మార్చవలసిన అవసరం లేదు. గులాబీపూల సంఖ్య, నాణ్యత తగ్గితే కొత్త మొక్కల్ని పెట్టాల్సిందే. అలాంటి మొక్కలను పడేయకుండా పెరట్లో నాటితే మళ్లీ పూస్తాయి.

**పోషణ ఇలా...** గులాబీల మట్టి పొడిబారకుండా చూసుకోవాలి. కుండీల్లోని మట్టి మిశ్రమంపై మెత్తటి సేంద్రియ ఎరువును చల్లితే తేమ కోల్పోకుండా చేయవచ్చు. కుండీల్లో పెంచే గులాబీలకు సాధారణంగా పొలుసు పురుగులు, నల్లి, తామర, పిండి పురుగులు పడతాయి. దాంతో పూలు ఆకర్షణ కోల్పోతాయి. ఈ సమస్యకు రసాయన పురుగుమందులు కాకుండా వేపనూనె వాడొచ్చు. ఇది ఫంగస్‌ని అదుపులో ఉంచుతుంది.



– సూరం సింధూజ, అసిస్టెంట్ ప్రొఫెసర్, శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యానవన విశ్వవిద్యాలయం, హైదరాబాద్

### నజరానా

పరుపుల కింద, అరల్లో వేప, తులసి ఆకులు వేస్తే నల్లులు, దోమలు రాకుండా ఉంటాయి.

### బంగారం-వెండి

12న ముగింపు-క్రితం

| హైదరాబాద్ | ముగింపు | క్రితం |
|---|---|---|
| బంగారం (24క్యా) | 35,600 | 35,860 |
| ఆర్నమెంట్ | 33,280 | 33,480 |
| వెండి (కిలో) | 39,040 | 39,270 |
| **విజయవాడ** | | |
| బంగారం (24క్యా) | 35,670 | 35,840 |
| ఆర్నమెంట్ | 33,050 | 33,200 |
| వెండి (కిలో) | 39,300 | 39,500 |
| **ప్రొద్దుటూరు** | | |
| బంగారం (24క్యా) | 34,400 | 34,500 |
| ఆర్నమెంట్ | 31,650 | 31,850 |
| వెండి (కిలో) | 39,000 | 39,200 |
| **రాజమహేంద్రవరం** | | |
| బంగారం (24క్యా) | 35,630 | 35,780 |
| ఆర్నమెంట్ | 32,960 | 33,300 |
| వెండి (కిలో) | 39,100 | 39,300 |
| **విశాఖపట్నం** | | |
| బంగారం (24క్యా) | 35,460 | 35,650 |
| ఆర్నమెంట్ | 32,980 | 33,150 |
| వెండి (కిలో) | 38,500 | 38,500 |
| **తమిళనాడు** | | |
| బంగారం ఆర్నమెంట్ (గ్రా) | 3,296 | 3,330 |
| వెండి (గ్రా) | 41.00 | 41.30 |

(రూ. లలో)

అంకురార్పణ

# చెత్తకు స్మార్ట్ చెక్!




చెత్త ఎందుకిలా పేరుకుపోతోందని ఆలోచించాడో కుర్రాడు.. దాన్ని ఆపే దిశగా అడుగులు వేశాడు.. చదివిన టెక్నాలజీని వాడుకున్నాడు. అంతే.. ప్రధానమంత్రి ప్రకటించడానికి ఒకడుగు ముందే 'స్వచ్ఛ భారత్' పేరుతో యాప్‌ని రూపొందించాడు. తర్వాత దాన్నే స్టార్టప్‌గా మలచి 'అంతరిక్ష్' పేరుతో నడుపుతున్నాడు.. ఆ చిన్నోడు ఎవరంటే? మహేశ్ ఎం షా. హైదరాబాదీనే. ఇంతకీ ఏంటీ అంతరిక్ష్? అని అడిగితే 'ఈ-తరం'తో తన జర్నీని పంచుకున్నాడిలా..

మొదట్నుంచీ ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్‌లంటే ఇష్టం. ప్రతిదాన్నీ నిశితంగా పరిశీలించేవాడిని. ఆ ఆసక్తితోనే ఐఐటీ మద్రాసులో మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశా.. తర్వాత హైదరాబాద్‌లోని ఓ ట్రేడింగ్ కంపెనీలో మూడేళ్లు పని చేశా. ఆ అనుభవంతో ఈ- కామర్స్ రంగంలో అంకుర సంస్థ స్థాపించా. వాస్తవ పరిస్థితులు తెలియక కొద్ది నెలల్లోనే కంపెనీని మూసేయాల్సి వచ్చింది. తర్వాత ఇటలీ వెళ్లి అక్కడ డిజైన్, ఎనర్జీ మేనేజ్‌మెంట్‌లో ఎంబీఏ పూర్తి చేసి తిరిగి ఇండియా వచ్చా. ఐఐటీ మద్రాసులో నాతో పాటు చదివిన కొందరు మిత్రులు, సీనియర్లు కలిసి స్టార్ట్ చేసిన కంపెనీలో ప్రొడక్ట్ మేనేజర్‌గా కొత్త బాధ్యత తీసుకుని 30కి పైగా ప్రొడక్ట్స్‌ని తయారు చేశా. అక్కడా ఆశించిన స్థాయిలో ఫలితం రాలేదు. అప్పుడే నాదైన ముద్ర వేసేలా ఏదైనా కొత్తగా స్టార్ట్ చేయాలనుకున్నా. అదీ సమాజ హితం కోరేదై ఉండాలని అన్వేషించా. మనకున్న ప్రధాన సమస్యల్లో చెత్త కుప్పలుగా పేరుకుపోవడం నాలో ఆలోచనకి పునాది అయ్యింది. పారిశుద్ధ్య కార్మికులు వారానికి ఒకటి రెండు సార్లు వచ్చి చెత్త సేకరిస్తున్నారు. ఒక్కోసారి చెత్త పూర్తిగా నిండిపోయి దుర్వాసన వస్తున్నా పట్టించుకునేవారుండరు. ప్రతిసారీ మున్సిపాలిటీ సిబ్బందికి ఫిర్యాదు చేయాలన్నా కష్టమే. మరేంటి దీనికి పరిష్కారం? అని ఆలోచించా. అలా పుట్టిందే 'స్వచ్ఛ భారత్' యాప్.

## నేనే ముందు..

ప్రధానమంత్రి స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడానికి ముందే 2014లో దీన్ని రూపొందించాను. దీంతో మీ ఇంటి పక్కన, మీ వీధిలోని గార్బేజ్ బిన్‌లో చెత్త పేరుకుపోతే, ఒక ఫొటో తీసి ఈ యాప్‌లో పోస్ట్ చేయాలి.. సంబంధిత ఫొటో నేరుగా ప్రధాని కార్యాలయ ట్విటర్ అకౌంట్‌కి చేరుతుంది.. ఇలా పేరుకుపోయిన చెత్తను ఫొటోల రూపంలో పీఎం కార్యాలయానికి చేరవేయడమే ఈ యాప్ పని. రోజులో చాలా ఫిర్యాదులు వచ్చేవి. ఇప్పటికి సుమారు లక్షన్నర ఫిర్యాదులు ఈ యాప్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి చేరాయి. చాలా సమస్యలు పరిష్కారమయ్యాయి కూడా.. ఇదే అంతరిక్ష్ అనే నూతన అంకుర సంస్థ స్థాపనకి ప్రేరణగా నిలిచింది.

## మొదటి పదిలో మేము..

ఏటా నూతన అంకురాలను ప్రోత్సహించేందుకు క్వాల్‌కం కంపెనీ పోటీలు నిర్వహిస్తుంది ఈ ఏడాది పోటీలో వందకు పైగా అంకుర సంస్థలు పాల్గొన్నాయి. ఇందులో మొదటి పది స్థానాల్లో నిలిచిన సంస్థల్లో మా అంతరిక్ష్ ఒకటి.

## ఏంటీ అంతరిక్ష్?

ప్రజలు, ఉద్యోగులు, పంచాయతీ కార్యాలయ సభ్యులు, పారిశుద్ధ్య కార్మికులకి తక్కువ ఖర్చులో ఐఓటీ టెక్నాలజీలతో స్మార్ట్ విధానంతో చెత్త నిర్వహించడం ఎలాగో అవగాహన కల్పిస్తున్నాం. గార్బేజ్ బిన్స్ దగ్గర ఏర్పాటు చేసిన స్తంభాలకు సెన్సర్‌లు అమర్చుతాం. అవి గార్బేజ్ బిన్స్ నిండగానే మున్సిపాలిటీ ఉద్యోగులు, చెత్తని సేకరించి తీసుకెళ్లే వర్కర్లకు మెసేజ్ రూపంలో సమాచారం చేరవేస్తాయి. అంతేకాదు.. గార్బేజ్ బిన్స్ చుట్టుపక్కల ఉన్న ప్రజల్ని దీంట్లో భాగస్వాముల్ని చేస్తున్నాం. నిండిన చెత్తని



ఎంత సమయంలో సేకరించి తీసుకెళ్తారో తెలుపుతూ అలర్ట్ మెసేజ్ వెళ్తుంది. ప్రస్తుతం స్మార్ట్ సిటీల రూపకల్పనలో భాగంగా పైలెట్ ప్రాజెక్టుగా సౌత్ చెన్నైలో ప్రయోగిస్తున్నాం. దేశంలోని ఇతర రాష్ట్రాలకూ ఈ ప్రాజెక్టు చేరేలా చేయాలనేది నా ఆలోచన.. ఇప్పటికైతే 11 మంది బృందంగా ఏర్పడి పని చేస్తున్నాం. 'ఐఓటీ' టెక్నాలజీ సాయంతో అందర్నీ భాగస్వాముల్ని చేస్తూ క్లీన్ ఇండియాని చూడాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం.

- నిఖిల్ గెంటిల

---

సీ టు ది 'పవర్' ఆఫ్ ఫోర్

ఫ్యామిలీ.. ఫ్రెండ్స్..
పుట్టిన రోజు.. పెళ్లి రోజు..
సంతోషం.. బాధ..
దేనికైనా మీరెలా స్పందిస్తున్నారు?
గ్రూపులో ఓ మెసేజ్.. లేకుంటే ఎఫ్‌బీలో గ్రీటింగ్స్..
ట్విటర్‌లో ఓ సంక్షిప్త సందేశం.. ఇంతేనా? స్మార్ట్‌ఫోన్‌లు సోషల్ లైఫ్‌లో చిక్కుకుని రియల్ లైఫ్‌కి దూరం అవుతున్నారా? అయితే, కచ్చితంగా 'సీ టూ ది పవర్ ఆఫ్ ఫోర్' స్కిల్ ఫార్ములా గురించి తెలుసుకోండి.

# లైఫ్ స్కిల్ ఫార్ములా



C4

### కేర్- మీపైనేనా?

రోజులో మీకు ఎంత మంది 'టేక్ కేర్' అని చెబుతున్నారో మీరెప్పుడైనా గమనించారా? కచ్చితంగా వారిలో అమ్మ, నాన్న, తోబుట్టువు, ఫ్రెండ్స్ ఎవరో ఒకరు ఉంటారు. మరి, మీరెంత మందికి 'టేక్ కేర్' అని చెబుతున్నారు? కనీసం పేరెంట్స్‌కైనా చెప్పారా? లేదే.. అని ఆలోచిస్తున్నట్లయితే తక్షణం 'కేరింగ్' తీసుకోవడం నేర్చుకోండి. ఎంతో కేర్‌తో సోషల్ మీడియా ప్రొఫైల్‌ని చూసుకుంటున్నట్టుగానే నిజ జీవితంలో చుట్టూ ఉండే వారికీ 'టేక్ కేర్' అంటూ రక్షణ వలయంగా మారండి.

### కమ్యూనికేషన్- ఒక వైపే కాదు!

కోపం, ఆవేశం, శాంతం, మౌనం.. ఇవన్నీ భావావేశాలు. వీటికి మూలం కమ్యూనికేషన్. ప్రేమ, ఫ్రెండ్‌షిప్, కెరీర్ దేంట్లోనైనా మీరు చేస్తున్న కమ్యూనికేషన్ ఆధారంగా మీలోని భావాల్ని ఎదుటివాళ్లు స్పష్టంగా అర్థం చేసుకుంటారు. అలాగే, ఇతరుల నుంచి వచ్చే స్పందనల ఆధారంగా మీరూ అవగాహనకి వస్తారు. మీరు చేస్తున్న సంభాషణల పట్ల మీరెంత ఆత్మవిశ్వాసంతో ఉంటారో.. ఇతరులూ అదే మాదిరిగా ప్రవర్తిస్తారు. సో.. ఇరువైపులా చక్కని కమ్యూనికేషన్ జరగాలంటే విషయం పూర్తిగా విని స్పందించడం మంచిది. అదే సరైన కమ్యూనికేషన్.

### కమిట్‌మెంట్- మీకుందా?

చదువు, ప్రేమ, జీవిత లక్ష్యం దేంట్లోనైనా నెగ్గాలంటే? నిబద్ధత అవసరం. చదువులో ర్యాంకులు సాధించాలన్నా.. ప్రేమలో గెలవాలన్నా.. మీ నిర్ణయానికి తోడయ్యేది మీకున్న నిబద్ధతే. అప్పుడే ఫలితం ఏదైనా వేచి చూడగలిగే దమ్ము, ధైర్యం పుడతాయి. దాంతో ఓటమిలోనూ విజయాన్ని చూడగలుగుతారు. ఏదో ఒక రోజు గెలుస్తారు.

### క్యురేట్- చేస్తున్నారా?

ఎక్కడికి వెళ్లినా.. ఏం చేస్తున్నా.. మంచీ చెడూ రెండూ ఉంటాయి. మంచిని స్వీకరిస్తూ చెడుని దూరం పెట్టాలి. చదువుకునే రోజుల్లో ఫ్రెండ్స్... ఉద్యోగం చేస్తున్నప్పుడు సహోద్యోగులు.. ఇలా అన్ని దశల్లోనూ మంచి, చెడుల్ని పరిచయం చేసేవారు ఎందరో. కొందరు ఓ మెట్టు పైకి ఎక్కించే ప్రయత్నం చేస్తే.. ఇంకొందరు కిందికి లాగేందుకు చూస్తుంటారు. అప్పుడు మీరెంత క్విక్‌గా 'క్యురేట్' చేసి దేన్ని ఎంపిక చేసుకుంటున్నారనేది మీ దారిని నిర్దేశిస్తుంది.

C4

---

సాఫ్ట్‌వేర్ ఉద్యోగులంటే.. వారంలో ఐదు రోజుల పని.. వీకెండ్ మొత్తం పార్టీలు, పబ్‌లు.. అంతేనా! ఏం కాదంటున్నారు ఈ టెకీలు. 'డిజిథాన్ డిజిటల్ యాత్ర'తో సాంకేతిక పాఠాలు నేర్పుతున్నారు. ఎవరికో తెలుసా? సర్కారు బడుల్లోని విద్యార్థులందరికీ. తెలంగాణ సమాచార సాంకేతిక సంఘం, టీ-హబ్‌లు సంయుక్తంగా ఈ యాత్రని నిర్వహిస్తున్నాయి.

పట్నం వదిలి.. పల్లెకు కదిలి

# డిజిటల్ శ్రీమంతులు

## ఏంటీ 'డిజిథాన్'?

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సాంకేతిక పాఠాలు నేర్పడం ఈ డిజిథాన్ డిజిటల్ యాత్ర లక్ష్యం. ఇందులో భాగంగా నగరానికి చెందిన దాదాపు 150 మంది యువ టెకీలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి అక్కడి విద్యార్థులకు సాంకేతిక పాఠాలు బోధిస్తారు. కంప్యూటర్, అంతర్జాల వినియోగంపై ప్రాథమిక అవగాహన కల్పిస్తారు. దీని ద్వారా సాంకేతిక నిరక్షరాస్యత శాతాన్ని తగ్గించి ప్రతి విద్యార్థికీ సాంకేతికతను పరిచయం చేయనున్నారు. ఈమెయిల్ ఖాతా సృష్టించడం, వాడకం, సామాజిక మాధ్యమాల ప్రయోజనాలు వివరిస్తారు. ప్రైవసీ చిట్కాల్ని బోధిస్తారు. అంతే కాకుండా ఐటీ రంగంలో స్థిరపడాలంటే ఏం చేయొచ్చు అనే అంశాలపై ప్రాథమిక అవగాహన కల్పిస్తారు. యాత్రలో ఆయా పాఠశాలల విద్యార్థులతోనే భోంచేసి వారితోపాటే ప్రభుత్వ వసతి గృహాల్లో నిద్రిస్తారు.



## పాఠశాల స్థాయిలో ఇంక్యుబేషన్ సెంటర్

యాత్రలో భాగంగా ప్రతి ప్రభుత్వ పాఠశాలలో టెక్నాలజీ ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ సెంటర్(టీఐసీ క్లబ్)ను ఏర్పాటు చేస్తారు. క్లబ్‌లో ఇద్దరు విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడు బృందంగా ఏర్పడి స్థానికంగా ఉన్న టిటా బృందంతో కలిసి పనిచేస్తారు. ప్రాథమిక దశ నుంచే విద్యార్థుల్లో సాంకేతికతపై అవగాహన కల్పించడమే క్లబ్ ముఖ్య ఉద్దేశం. దీంతో విద్యార్థుల్లో ఉన్న నూతన ఆలోచనలు వెలుగులోకి తీసుకొచ్చి వారి భవితకు బంగారు బాటలు వేయనున్నారు. ఇప్పటికి రెండు జిల్లాల్లో ఈ యాత్ర విజయవంతమైంది. త్వరలో మిగతా జిల్లాల్లో పూర్తి చేయనున్నారు. అలాగే 'డిజిటల్ గావ్' పేరిట రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు చేస్తున్నారు. ప్రతి గ్రామంలో డిజిటల్ అక్షరాస్యత పెంపొందించడంతో పాటు ప్రజలకు పథకాలు, బ్యాంకు లావాదేవీలు తదితరాలపై అవగాహన కల్పించారు. గతేడాది బాసర గ్రామాన్ని దత్తత తీసుకొని నూరుశాతం సాంకేతికత వినియోగం పట్ల అవగాహన కల్పించి 'డిజిటల్ బాసర'గా తీర్చిదిద్దారు.

- ఇట్ట అభిసాయి, ఈనాడు డిజిటల్, హైదరాబాద్


---

మనసులో మాట

# నా చదువు తనకి కానుక

తాము నెరవేర్చుకోలేనివి తమ పిల్లల ద్వారా నిజం చేయాలనుకుంటారు పేరెంట్స్. ఇంటర్ తర్వాత నాకూ అలాంటి పరిస్థితే ఎదురైంది. ఎంసెట్‌లో మంచి ర్యాంకు రావడంతో నాన్న నన్ను ఇంజినీరింగ్‌లో చేర్పించారు. నాకు ఇష్టం లేకపోయినా నాన్న ఆనందం కోసం ఒప్పుకొన్నా. 2012 సెప్టెంబర్‌లో నా క్యాంపస్ జర్నీ మొదలైంది. చదువుతో పాటు వివిధ రకాల మనుషులు వారి మనస్తత్వాలు తెలుసుకుంటూ ఆ లైఫ్‌కి అలవాటు పడుతున్నా. ఓ రోజు తీవ్రమైన అనారోగ్యంతో ఇంటికి వెళ్లాల్సివచ్చింది. తీసుకు వెళ్లేందుకు బైక్‌పై నాన్న వచ్చారు. ఇంటికెళ్లే దార్లో యాక్సిడెంట్. స్పృహలోకి వచ్చేసరికి నేనొకచోట.. నాన్నొకచోట.. రోడ్డు మీద పడిఉన్నాం.. అదంతా అటవీ ప్రాంతం కావడంతో బంధువుల సాయంతో హాస్పిటల్‌కు చేరుకున్నాం. నెలలు గడిచాయి. నాన్న ఆరోగ్యం కుదుటపడింది. నేను మాత్రం జరిగిన ప్రమాదం నుంచి తేరుకోలేకపోయాను. మమ్మల్ని పలకరించడానికి బంధువులు, స్నేహితులు వచ్చి వెళ్లేవారు. వాళ్లలో ఒకావిడలో ఏదో ఎనర్జీ చూశా. చాలా ఉత్సాహంగా కనిపించారు. నాకెందుకో చాలా రిఫ్రెషింగ్‌గా అనిపించింది.

ఎదురుగా కూర్చున్న తన కొడుకుని చూపించి నవ్వింది. విచిత్రమేమిటంటే అతనూ నాలాగే కట్టుకట్టుకుని కూర్చున్నాడు. అతడు కూడా వాళ్ల అమ్మలానే నవ్వుతూ హాయ్ చెప్పాడు. నా ముఖంలో ఇంజినీరింగ్‌పై అనాసక్తిని గమనించాడేమో. చదువు తప్ప అన్ని విషయాల గురించి మాట్లాడాడు. ఎందుకో.. తన మాటల్లో నన్ను నేను చూసుకున్నట్టు అనిపించింది. నాలాగే ఆలోచిస్తున్నట్టుగా తోచింది. ఇలా ఆలోచిస్తుండగా.. 'ఈ ఏడాది చివర్లో అమెరికాకి వెళ్తున్నా. మాస్టర్స్ చేయడానికి..' అన్నాడు. ఆశ్చర్యంగా అతడివైపు చూశాను. 'కేవలం చదువు కోసమే. ఎలక్ట్రానిక్స్ గురించి రిసర్చ్ చేయడానికి' అంటూ.. నాకు తెలియని



అంశాలను ఆసక్తికరంగా వివరించాడు. తను చెబుతుంటే.. అప్పటి వరకూ నాకు తెలియని నన్ను చూశాను.

మెల్లగా ప్రమాదం నుంచి తేరుకున్నాను. మళ్లీ ఫ్రెష్‌గా కళాశాలలో అడుగుపెట్టాను. నేర్చుకునే ప్రతీ అంశాన్నీ నిజజీవితానికి ముడేసి చూడడం అలవాటు అయ్యింది. అలా రెండేళ్లు గడిచాయి. కానీ, ఏదో అసంతృప్తి. ఇష్టపడే చదువుతున్నా.. కానీ నా లక్ష్యం ఏంటి? అనే ఆలోచన మొదలైంది. ఒక రోజు అప్పుడే కాలేజీ నుంచి ఇంటికి వచ్చా..

అదే రోజు మమ్మల్ని పలకరించడానికి వచ్చిన ఆంటీ కనిపించారు. నా క్షేమసమాచారాలు అడుగుతూనే 'మరో మూడు నెలల్లో మా అబ్బాయి అమెరికా నుంచి వస్తున్నాడు' అంది. ఆ మాటతో నాలో అలజడి. రెండేళ్లలో నేను అతనితో ఎన్నడూ మాట్లాడింది లేదు. అయినా.. అతని ఆలోచనలే. అతని కుటుంబ సభ్యుల్లాగే నేను కూడా అతడి రాకకోసం ఎదురుచూస్తున్నాను.

ఎప్పటిలానే ఆ రోజూ స్నేహితులతో కబుర్లు చెబుతూ.. ఇంటికి చేరుకున్నాను. ఇంట్లో అందరూ డల్‌గా ఉండటం చూసి ఏం జరిగిందని అడిగా. ఎవరి నుంచీ సమాధానం లేదు. కొన్ని గంటల తర్వాత విషయం తెలిసింది. నిన్న రాత్రి అమెరికాలో ఆంటీ వాళ్ల అబ్బాయి కారు ప్రమాదంలో చనిపోయాడని. ఒక్కసారిగా ఏం చెప్పారో.. నా చుట్టూ ఏం జరుగుతుందో అర్థం కాలేదు. కొన్ని రోజుల్లో వస్తాడన్న వ్యక్తి కనిపించడు.. రాడు అన్న విషయం జీర్ణించుకోలేకపోయాను. అతడి మాటలే నిత్యం గుర్తొచ్చేవి..! నాతో అతడు మాట్లాడింది.. రోజులో కొన్ని గంటలే కానీ అవి చెరగని ముద్ర వేశాయి. అతని ఆలోచనలతో చదువు ముందుకు సాగేది కాదు. ఎందుకంటే నాకు ఇంజినీరింగ్ చదువుపైన ఆసక్తి కలిగించేలా చేసింది అతడే. తనే లేకపోవడం బాధించింది. వచ్చిన సబ్జెక్ట్ అయినా పరీక్ష గదిలోకి వెళ్లాక ఖాళీ పేపరు ఇచ్చి వచ్చిన సందర్భాలూ ఉన్నాయి. ఒకరోజు అద్దంలో నన్ను నేను బాగా ప్రశ్నించుకున్నా. అప్పుడు నిశ్చయించుకున్నా. నా డిగ్రీని అతనికి కానుకగా ఇవ్వాలని కష్టపడ్డాను. అవగాహన లేని విషయాలపై పట్టుసాధించి మళ్లీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాను. నా కాన్వకేషన్ డిగ్రీ ప్రదానోత్సవంలో అందరం విడిపోతున్నందుకు బాధ పడుతుంటే.. నాకు మాత్రం అతడి ఆశయం నెరవేర్చినందుకు ఆనందబాష్పాలు వచ్చాయి.

● అతడిని తలుచుకుంటూ బాధపడేకంటే నేను చేసే ప్రతి పనిలో తనే ఉన్నాడనుకుని ముందుకు సాగుతున్నా. బహుశా జీవితమంటే ఇదేనేమో.

- హారిక ఆద్య